క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



నోటీస్ బోర్డులో రూమ్ నంబర్స్‌ను చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

పగిడ్యాల: లక్ష్మాపురం అంచె వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆదివారరం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 5వ తరగతి, మధ్యాహ్నం ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ తెలిపారు. 5వ తరగతిలో 180 మంది పరీక్షలకు గానూ 168 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశానికి 218 విద్యార్థులకు గానూ 190 మంది విద్యార్థులు హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారలు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

పకడ్బందీగా గురుకుల ప్రవేశపరీక్ష



గురుకులం ప్రవేశపరీక్ష రాస్తున్న విద్యార్థులు

జూపాడుబంగ్లా: సాంఘిక సంక్షేమ శాఖ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల నిమిత్తం ఆదివారం పకడ్బందీగా ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో ఉదయం ఐదో తరగతి ప్రవేశపరీక్ష నిర్వహించగా 294 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు హాజరుకాగా 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించగా 366 మంది విద్యార్థులకు గాను 300 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

మహానందిలో సండే సందడి



మహానంది ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

మహానంది: మహానంది ఆలయం ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులతో కిటకిటలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండరామాలయం, ఆంజనేయ స్వామి, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

శిక్షణా తరగతులకు హాజరవ్వాలి

పాములపాడు: ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు ఆత్మకూరు పట్టణంలో నిర్వహించే శిక్షణా తరగుతులకు మండల స్థాయి అధికారులు హాజరవ్వాలని తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విపత్తుల నుంచి సంభవించే ప్రమాదాలను తగ్గించడం ఎలా అనే అవశంపై శిక్షణ రగతులు ఉంటాయన్నారు.

మేడేను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): కార్మికులంతా ఏకమై మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామ్మూర్తి, సుంకయ్య, ఉమ్మడి జిల్లాల మాజీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మురళీధర్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండాగా వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మేడేగా మే 1వ తేదీని జరుపుకుంటున్నామన్నారు. నంద్యాల జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రంజిత్, సుశీలమ్మ, నాగేశ్వరరావు, ఏలియా, ఆశీర్వాదం, కాశమ్మ, ఈశ్వరమ్మ, సుబ్బమ్మ, ఆటో యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథుడికి భక్ష్యాల నైవేద్యం



స్వామివారిని దర్శించుకోవటానికి భారులు తీరిన భక్తులు



స్వామివారి దర్శనానికి భక్ష్యాల బండ్లతో తరలివచ్చిన రైతులు





భక్తులను ఆశీర్వదిస్తున్న లక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్ల మూలవిగ్రహాలు

తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం రథోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి అపురూపమైన దివ్యమంగళరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రైతులు భక్ష్యాలబండ్లు కట్టుకొని వచ్చి స్వామివారికి వారి పొలాల్లో పండిన దాన్యంతో పాటు బియ్యం, కందిబేడలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సంపూర్ణంగా కురిసి సాగుచేసిన పంటలు సమృద్ధిగా పండాలని రైతులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామివారి దివ్యరూపాన్ని కనులారా దర్శించుకుని తరించిపోయారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామితో పాటు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. – జూపాడుబంగ్లా

డీఏ అరియర్స్ ఎప్పుడో?

– ఉద్యోగుల ఎదురుచూపులు

మహానంది: డీఏ అరియర్స్ చెల్లించాలని దేవస్థానం ఉద్యోగులు కోరుతున్నారు. మహానందిలో సుమారు 55 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరికి గత ఏడాది డీఏ అరియర్స్ గత ప్రభుత్వ హయాంలోనే మంజూరైనా నేటికీ చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. శివరాత్రి కానుకగా పాత బకాయిలు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. నూతన తెలుగు సంవత్సరాది ఉగాదికైనా వస్తుందంటే అదీ రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ఈ నెలాఖరులోగా అయినా విడుదల చేస్తే తమ పిల్లల చదువుల ఖర్చులకు ఉపయోగపడుతుందని పలువురు కోరుతున్నారు. కాగా శ్రీశైలం, ఇతర ప్రముఖ ఆలయాల్లో డీఏ బకాయిలు గతంలోనే విడుదల చేసినట్లు సమాచారం. ఏటా ఆర్థిక సంవత్సరం మార్చితో ముగుస్తుంది. మార్చి బడ్జెట్‌లోనే చెల్లించాల్సి ఉన్నా ఆదాయం తక్కువగా చూపినవారమవుతామనే కారణంతో ఉద్యోగుల డీఏ అరియర్స్ నిలిపినట్లు విశ్వసనీయ సమాచారం. వచ్చే నెల చెల్లించనున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ



వడ్డేమాన్ సీఎస్ఐ చర్చి వద్ద ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ముసలమడుగు గ్రామంలో ..



చర్చి చుట్టూ మట్టలతో తిరుగుతున్న క్రైస్తవులు

నందికొట్కూరు: నందికొట్కూరు, మిడుతూరు మండలాల్లోని క్రైస్తవులు మట్టల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. యేసు క్రీస్తు శిలువ మరణానికి ముందుగా మట్టల పండుగను నిర్వహించుకుంటామని ఫాదర్ మధుబాబు తెలిపారు. సకల మానవాళికి లోక రక్షకుడైన యేసుక్రీస్తు బాటలో నడవాలని సూచించారు. ఈత మట్టలను పట్టుకుని ఊరు, వాడల్లో ర్యాలీలు నిర్వహిస్తూ యేసుక్రీస్తు బోధనలు వివరించారు. వడ్డేమాన్ గ్రామంలో సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఇమ్మానియేల్ బాబు యేసుప్రభు గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి అమల్ కుమార్, వడ్డేమాన్ సంఘాల పెద్దలు యాకోబు, తిరుపాలు, సుబ్బన్న పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీఎస్ఐ సంఘ పాస్టరేట్ చైర్మన్ భరత్ దివాకర్ బాబు ముసలిమడుగు, ఎర్రమఠం, సింగరాజు పల్లి, శివపురం, ఎం లింగాపురం, కొత్తపల్లి, ఫాదర్ బెర్నాడ్ ఆధ్వర్యంలో గువ్వలకుంట్ల, వీరాపురం, గుమ్మడాపురం గ్రామాలలో, దుద్యాల, కొక్కెరంచ గ్రామాల్లో, సీఎస్ఐ సంఘ పాస్టరేట్ చైర్మన్ జాన్ ఇమ్మానియేల్ బాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలు చేత పట్టి వీధుల వెంట ఏసుక్రీస్తు పాటలు పాడుతూ, ప్రార్థనలు చేస్తూ శాంతి ర్యాలీలు నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు పట్టుకుని చర్చి చుట్టూ తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మహమ్మద్‌ముక్తియ మృతదేహం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై దొరపల్లె జగనన్న కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం కునేగల్‌కు చెందిన మహమ్మద్ ముక్తియ (45)అనే లారీ డ్రైవర్ మృతిచెందాడు. కర్నూలు నుంచి బెంగళూరు వైపునకు వెళుతున్న పార్శిల్ మినీ లారీ తెల్లవారుజామున ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ లారీ డ్రైవర్ మహమ్మద్ ముక్తియ క్యాబిన్‌లో ఇరుక్కొని మృతి చెందగా క్లీనర్ చంద్ర శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు క్లీనర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డోన్ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు.

కారు – లారీ ఢీ

- ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆల్విన్, కారు

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం కారు – లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఎన్‌హెచ్ 340సీ రోడ్డుపై తంగడంచ గ్రామ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద కర్ణాటక నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు, విజయవాడ నుంచి పచ్చిటెంకాయలతో ఆదోని వెళ్తున్న ఆల్విన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆల్విన్ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడగా కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఆల్విన్ డ్రైవర్ లక్ష్మణ్, కారు డ్రైవర్ ధనుంజయ, కారులోని ఓ మహిళ ఇద్దరు పిల్లలకు గాయాలవ్వగా వారిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు సేఫ్టీ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని ఆల్విన్, కారును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

బైక్‌లు ఢీ

తర్తూరు నుంచి వస్తున్న ఓ బైక్, తర్తూరులోకి వెళ్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొనటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నందికొట్కూరుకు చెందిన వలి, కడుమూరుకు చెందిన అజయ్ బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికీ కాళ్లు, చేతులు విరగటంతో వారిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి కూలీలకు బీమా వర్తింపజేయాలి



జీపుజాతాలో నాయకులు

బండి ఆత్మకూరు: ఉపాధి కూలీలకు ప్రమాద బీమా వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి, మండల కార్యదర్శి డేవిడ్ డిమాండ్ చేశారు. ఆదివారం చిన్న దేవళాపురం, నారాయణాపురం, సంత జూటూరు, పెద్ద దేవళాపురం, ఈర్నపాడు, బండిఆత్మకూరు, కడమల కాలువ గ్రామాల్లో జీపు జాతా నిర్వహించారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కనీస వేతనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల న్యాయమైన డిమాండ్ల కోసం ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని కూలీలకు సూచించారు.

అ‘పూర్వ’ కలయిక

నందికొట్కూరు: మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమై అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు శాలిరెడ్డి, వెంకటసుబ్బయ్య, లతీఫ్, చార్లెస్, దస్తగిరి, ఫాతిమాబీ, ఉమామహేశ్వరరెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలకు బీరువాను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏసేపు, రఘుస్వామిరెడ్డి, రమణ, శ్రీధర్, స్వాములు, శివ, రాముడు తదితరులు పాల్గొన్నారు.



గజం స్థలం ఉందని నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో తన పేరుపై గజం స్థలం ఉందని నిరూపించినా రాజకీయాలకు స్వస్తి పలుకుతానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం ఆయన ఏపీ జెన్‌కో అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తనపై అవినీతి మరకలు అంటించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాడన్నారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపాలని ఆరాటపడుతున్నాడన్నారు. సున్నిపెంటలో ఆస్తులు కూడబెట్టిన వారిని తన బినామీలుగా పేర్కొంటూ తప్పుడు ఫిర్యాదులను ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఇచ్చి తనను కబ్జాదారుడిగా చిత్రీకరించే నీచ సంప్రదాయానికి బుడ్డా తెరలేపడం సిగ్గుచేటన్నారు. అక్రమ కేసులకు, నిర్బంధాలకు భయపడేది లేదన్నారు. చర్యకు ప్రతి చర్య తప్పకుండా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, భవిష్యత్‌లో మరోసారి గెలవలేమనే భయంతో అందినకాడికి దోచుసుకుంటున్నారన్నారు. ఇసుక, ఇటుక, సిమెంట్, కంకర లారీలకు బి-ట్యాక్స్ విధిస్తూ, ఇళ్ల నిర్మాణానికి ఓ రేటు, లాడ్జీ నిర్మాణానికి ఓ రేటు, వ్యాపార దుకాణ నిర్మాణానికి ఓ రేటు వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడన్నారు. నియోజకవర్గంలో వైన్‌షాప్ యజమానులను బెదిరించి అన్యాయంగా 50 శాతం వాటా తీసుకుంటున్నారని, బుడ్డా అనుచరులు విచ్చల విడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని శిల్పా ఆరోపించారు. రెడ్‌బుక్, అక్రమ కేసులకు భయపడవద్దని, తాను అండగా ఉంటానని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అనంతరం గిరిజన నాయకుడు కుడుముల మూగెన్న తన వ్యవసాయ భూమిలో నిర్మించిన వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన బిల్ల రమేష్ శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భార్య బిల్ల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంతి

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటల్లోపు పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు తరలిరావాలని కోరారు.

జూనియర్ అసిస్టెంట్‌పై చీటింగ్ కేసు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు.. గత ఏడాది సెప్టెంబర్ 3న బండిఆత్మకూరు మండలం లింగాపురానికి చెందిన సాయికృష్ణకు అతని తల్లి శ్రీదేవి సర్వే నంబర్ 422/ఏ2లో ఉన్న 4.22 ఎకరాల భూమిని కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాన విక్రయం చేయించింది. కాగా ఈ సర్వే నంబర్ గల భూమి ఇదే గ్రామానికి చెందిన సంజన్న అనే వ్యక్తి పేరున ఉంది. ఈయన రెండేళ్ల క్రితం మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ పొలం అనుభవంలో ఉన్నాడు. ఈ సర్వేనంబర్ పక్కనే శ్రీదేవి భర్త మోహన్‌రావుకు సంబంధించిన పొలం ఉంది. తన పొలం సర్వేనంబర్ సాకుతో బండి ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాకుండా కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌తో రిజిస్టర్ చేయించారు. ఆ రోజున సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో వీరి పని మరింత సులువైంది. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా నకిలీ పన్ను రసీదు ఆధారంగా మోహన్‌రావు తన భార్య శ్రీదేవి ద్వారా కుమారుడు సాయికృష్ణకు దాన విక్రయ రిజిస్టర్ చేయించాడు. అప్పట్లో ఈ వ్యవహారం బయటకు తెలిసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఈ ఏడాది జనవరి నెలలో పొలానికి సంబంధించి వివరాలు చెక్ చేసుకోగా అడంగల్‌లో తన తండ్రి పేరున పొలం లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన సబ్‌రిజిస్ట్రార్ అధికారులు చంద్రశేఖర్‌ను కొంతకాలం క్రితం సస్పెండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ నిర్వాహంతోనే పొలం రిజిస్టర్ జరిగిందని బాధితుడు కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఆదివారం రాత్రి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

కేసీకి నీటి విడుదల బంద్

పాములపాడు: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల నిలిపి వేసినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేసీ కెనాల్ పరిధిలో పైర్లకు నీటి అవసరం లేనందున నీటి విడుదల నిలిపివేశారు. కాగా వేసవిలో ప్రజలకు త్రాగు నీటి అవసరాల కోసం కేసీ కెనాల్ 120వ కిలోమీటర్ లాకిన్స్‌లా వద్ద సుమారు 2,000 క్యూసెక్కుల నీటిని నిల్వ చేశామన్నారు.

హెల్మెట్ ధరించాలి

పాములపాడు: ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆదివారం మిట్టకందాల గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సులో భాగంగా ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు హెల్మెట్, సీటు బెల్ట్‌ల ప్రాధాన్యతను వివరించారు. ఆటోలలో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఆర్‌సీ, ఇన్సూరెన్స్, 100 కాల్‌ల ప్రాధాన్యతను వివరించారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు: ఈనెల 14న నిర్వహించబోయే అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు సంఘం నాయకులు కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జీపు యాత్ర ఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాషాపోగుల దరగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లె బుజ్జి మాదిగ మాట్లాడుతూ పాత బస్టాండు ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు తాలూకా అధ్యక్షులు పెరుమాళ్ల చింతలయ్య, తాలూకా జనరల్ సెక్రటరీ సగినాల రవికుమార్, నాయకులు రమణ, శ్యామ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ వర్ధంతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిర్వహించారు. పలువురు నాయకులు బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగన్న, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్, తాలూకా కార్యదర్శి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మన్నెం బాలస్వామియాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ మండల కమిషన్‌కు అధ్యక్షత వహించిన భారతీయ రాజకీయ నాయకుడన్నారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలో వెనకబడిన తరగతుల (ఓబీసీ) అభ్యర్థులకు రిజర్వు సీట్లను నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిఫారసు చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామినాయక్, వీరన్న, కురుకుంద వెంకటేశ్వర్లు, రమణ, సంజీవరాయుడు, నాగన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి

- వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తులు



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులతోపాటు అమ్రాబాద్ వద్ద సలేశ్వరం జాతర ఉండటంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శ దర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల వాహనాల రాకపోకలతో ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు వాహనాల రద్దీ ఏర్పడింది.

ఆత్మీయ సమ్మేళనం

కొత్తపల్లి: మండలంలోని గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువుచెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్ ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు